క్లుప్తంగా

సమన్వయంతో పని చేద్దాం



మాట్లాడుతున్న ఆర్డీఓ సన్నీ వంశీకృష్ణ

కదిరి అర్బన్: వినాయక నిమజ్జనం రోజు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆర్డీఓ సన్నీ వంశీకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో డీఎస్పీ శ్రీలత, మున్సిపల్ కమిషనర్ కిరణ్‌తో పాటు అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, పలు శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. వినాయక నిమజ్జనం రోజున తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆర్డీఓ తెలియజేశారు. ప్రతి వినాయక మంటపం వద్ద అన్ని శాఖల ఫోన్ నంబర్స్ పెట్టించాలన్నారు. సాధారణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిమజ్జనం పూర్తి చేయాలన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

ముదిగుబ్బ: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ముదిగుబ్బ రూరల్ సీఐ శ్యామ్‌రావు సూచించారు. శుక్రవారం ఆయన మలకవేముల క్రాస్ వద్ద ఆటో డ్రైవర్లు, ప్రైవేటు వాహనదారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలించరాదని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలన్నారు. వాహన రికార్డులను వాహన యజమానులు దగ్గర ఉంచుకోవాలన్నారు.

ఆలయానికి విరాళం



ఉలగన్నకు నగదు అందిస్తున్న డా.బత్తల రాంప్రసాద్

కదిరి అర్బన్: కదిరి కొండ కింద ఉన్న ఆంజనేయస్వామి ఆలయానికి గురువారం వైఎస్సార్ కాంగ్రెస్‌పీపీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. బత్తల హరిప్రసాద్ సతీమణి డా. సజినీ కుమారి రూ.50 వేలు విరాళాన్ని అందజేశారు. ఈ మొత్తాన్ని డా. బత్తల రాంప్రసాద్ చేతుల మీదుగా ఆలయ కమిటీ నిర్వాహకులు ఉలగన్నకు అందజేశారు. నగదుతో ఆలయంలో టైల్స్, ఫ్లోరింగ్ పనులు పూర్తి కానున్నాయి. కార్యక్రమంలో కాంట్రాక్టర్ బాబా, జాకీర్, కిరణ్, బాబ్జాన్, ముబారక్ పాల్గొన్నారు.

అధ్యాపకుడికి డాక్టరేట్ ప్రదానం




రవీంద్ర

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీ ఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర అధ్యాపకుడిగా పని చేస్తున్న కూబా రవీంద్రకు శుక్రవారం కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. ద్రవిడ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ అరవింద్ కుమార్ పర్యవేక్షణలో 'స్టడీ ఇన్ ద టూరిస్ట్ సైట్స్ ఇన్ అనంతపురం' అన్న అంశంపై పరిశోధన పూర్తి చేసినందుకు గాను ఈ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. రవీంద్ర స్వగ్రామం శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి మండలం గువ్వలగుట్టపల్లి.

రేపు జిల్లాస్థాయి టీచర్స్ క్రీడా పోటీలు

ధర్మవరం అర్బన్: యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా ఆదివారం జిల్లాస్థాయి టీచర్స్ క్రీడా పోటీలు నిర్వహించనున్నామని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మడకశిర ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇండోర్ స్టేడియంలో ఉపాధ్యాయులకు బాస్కెట్‌బాల్, షటిల్, బ్యాడ్మింటన్, వాలీబాల్, 100, 200 మీటర్ల పరుగు పందెం, 400 మీటర్ల వాకింగ్, షాట్‌పుట్, జావెలిన్‌త్రో, క్యారమ్స్ పోటీలు నిర్వహించనున్నామని తెలిపారు. ఈనెల 14న కదిరి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మహిళా టీచర్స్‌కు షటిల్, త్రోబాల్, షాట్‌పుట్, స్పీడ్ వాక్, టెన్నికాయిట్ పోటీలు నిర్వహిస్తామన్నారు. యూటీఎఫ్ నాయకులు రామకృష్ణానాయక్, ఆంజనేయులు, లక్ష్మయ్య, హరికృష్ణ, రాంప్రసాద్, సాయిగణేష్, రామంజనేయులు, అమర్ నారాయణరెడ్డి, వినయ్‌కుమార్, శివయ్య, గోపాల్‌రెడ్డి, సకల చంద్రశేఖర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

14న ఉపాధ్యాయినులకు క్రీడాపోటీలు



బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయినులు

కదిరి అర్బన్: యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా ఈ నెల 14న జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయినులకు క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్‌బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన క్రీడా పోటీల బ్యానర్‌ను ఆవిష్కరించారు. నాయకులు శ్రీనివాసులు, తాహిర్ వలి,సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు యశోద, సుజాత, రాణి, లక్ష్మీ ప్రసన్న, ప్రత్యూష, ఆయేషా, మానస తదితరులు పాల్గొన్నారు.

వి'నాయకుడు'

- గణనాథుడి చెంత నాయకత్వ లక్షణాలెన్నో.
- నేటి నుంచి వినాయక చవితి ఉత్సవాలు



ధర్మవరం అర్బన్: వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా జరిపేందుకు జిల్లా ముస్తాబవుతోంది. ఇప్పటికే వినాయక మండపాలు సిద్ధమయ్యాయి. వినాయకులను కూడా మండపాల వద్దకు చేర్చారు. శనివారం వినాయక చవితి సందర్భంగా గణపయ్యలను కొలువుదీర్చనున్నారు. వినాయకుడు ఆది దేవుడు.. ఆశయసిద్ధి కోసం కొలిచే దైవం.. విఘ్నాలను తొలగించే దైవం.. ఉత్సవాల్లో తొమ్మిది, ఐదు, మూడు రోజులపాటు భక్తితో పూజిస్తారు. గణనాథుడ్ని చిత్తశుద్ధితో పరిశీలిస్తే రూపురేఖలు, గుణగణాలు, వ్రత విధానంలో యువత నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవచ్చు. వ్యక్తిత్వ వికాసం పొందవచ్చు.

పెద్ద శిరస్సు, చెవులు..
– గొప్పగా ఆలోచించు.. చిన్నగా ప్రారంభించు..

వినాయకుడి తల ఆయన శరీరం పరిమాణానికంటే పెద్దదిగా ఉంటుంది. ఆయన పాదాలు అతడి భారీ శరీరంతో పోల్చినప్పుడు చిన్నవిగానే ఉంటాయి. ఈ తీరు గమనించే యువత ఏ విషయమైనా ఆలోచించి స్పష్టమైన విధానంతో ప్రారంభించాలని వ్యక్తిత్వ వికాస నిపుణులు చెబుతున్నారు. వృత్తి, జీవితంలో ఉన్నత స్థితికి చేరాలంటే ఆలోచనలు, ఆశయాలు పెద్దవిగా ఉండాలి. ప్రయత్నం మాత్రం శక్తి సామర్థ్యాల పరిధిలో చిన్నగా ప్రారంభించాలి. యువతలో వినడంలోనూ ఓపిక తగ్గుతోంది. తరగతి గదిలో పాఠాలను వినడంలోనూ ఆసక్తి తగ్గుతోంది. వినాయకుడి చాటంత చెవులను గమనిస్తే ఎదుగుదలకు శ్రవణశక్తి అపారంగా ఉపయోగపడుతుందని గమనించాలి.

నేత్రాలు..
– వీక్షణంలో చురుకుదనం..

అవకాశాలనైనా, ప్రమాదాలనైనా పసిగట్టాలంటే మనం అప్రమత్తంగా ఉండాలి. కంటికి కనబడుతున్న దాన్ని మాత్రమే కాక దాని పూర్వాపరాలను గ్రహించగలగాలి. ఏనుగు కళ్లకన్నా చెవులూ, ముక్కు(తొండం) అనేక రెట్లు చురుగ్గా ఉంటాయి. ఎప్పుడూ కదులుతూ అన్ని వైపుల నుంచి వచ్చే సంకేతాలను ఒడిసి పట్టుకుంటాయి. ముఖ్యంగా ఏనుగు ఒక కన్నే మూసుకుని నిద్రపోతుంది. కాని తనకు ప్రబల శత్రువైన సింహాన్ని కలలోకి కూడా రానీయకుండా జాగ్రత్త తీసుకుంటుందని సంప్రదాయ కథనం. మనం గణేశుని నుంచి నేర్చుకోవాల్సిన లక్షణాల్లో అప్రమత్తత ముఖ్యమైంది.

పోటీకి భయపడవద్దు...

పోటీకి భయపడనప్పుడే వృత్తిలోనూ, జీవితంలోనూ పైకి రావొచ్చు. తన కంటే ఎంతో అనుకూలత ఉన్న కుమారస్వామితో వినాయకుడు పోటీ పడాల్సి వచ్చినప్పుడు గణనాథుడు వెనక్కి తగ్గలేదు. బుద్ధిబలంతో అవరోధాలను అధిగమించిన తీరు యువతకు స్ఫూర్తిదాయకం.

పెద్ద ఆకారం..
– పని సామర్థ్యానికి పరిమితులు వద్దు..

అవకాశాలు ముందుగా చెప్పిరావు. అదృష్టమంటే మన అర్హతలకు తగిన అవకాశం లభించడమే అంటారు పెద్దలు. అంటే మనం పెద్ద పనులు చేసేందుకు తగిన సామర్థ్యంతో సిద్ధంగా ఉండాలి. వినాయకుడు పెద్దపొట్ట, నాలుగు చేతులతో ఎంతపనైనా చేయడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పకనే చెబుతాడు. జీవితంలో పైకి ఎదగాలనుకునేవారు ఈ విషయాన్ని గ్రహించాలి. పని సామర్థ్యానికి పరిమితి విధించుకోకూడదు.

ఆయుధాలు..
– బంధాలు కావాలి, బంధనాలు వద్దు..

వినాయకుడి చేతిలోని పాశం తన పరిసర వ్యక్తులతో ఏర్పరచుకోవాల్సిన సంబంధ, అనుబంధాలు, మరొక చేతిలో గొడ్డలి లక్ష్యశుద్ధి ఛేదనాబలానికి గుర్తులు. సానుకూల సంబంధాలను పెంచుకోవడం, ప్రతికూల సంబంధాలను త్యజించడం జీవితంలో నేర్చుకోవాల్సిన నైపుణ్యాల్లో ఒకటని ఈ ఆయుధాలు సూచిస్తాయి. దీనికి వినాయకుడే ప్రతీక.

ద్వారపాలకుడిగా విధులు..
– గౌరీనందుడి కర్తవ్య నిష్ఠ...

తన కర్తవ్యం నిర్వర్తించేందుకు వెనుదీయకపోవడం మనం వినాయక చవితి కథలో వింటాం. ద్వారం వద్ద శివుణ్ణి అడ్డగించకపోతే ఆ బాలుడు ఎప్పటికి ద్వార పాలకుడిగానే ఉండిపోయేవాడేమో. అప్పగించిన పనిని పూర్తిశక్తి సామర్థ్యాలను ఉపయోగించి పూర్తి చేయడం లక్ష్యం కావాలి. ఫలితం ముఖ్యం కాదు. ప్రయత్నంలో రాజీ లేకపోతే సత్ఫలితాలను సాధించవచ్చనే దానికి గౌరీనందనుడే అతి పెద్ద ఉదాహరణ.

– ఏకదంతం..
– ఆత్మవిశ్వాసమే ముద్దు.. అహంకారం వద్దు..

ఏనుగు దంతాలు అందానికీ, ఆత్మవిశ్వాసానికి గుర్తులు. దంతాలు కొంత పొడవు ఉన్నంత వరకూ అవి బరువులు మోయడంలో తొండానికి సహాయకారిగా ఉంటాయి. ఒకస్థాయి దాటిన తర్వాత పనికి అడ్డుపడతాయి. ఆత్మవిశ్వాసం మితిమీరితే అహంకారమై ఆశయసిద్ధికి ఆటంకంగా మారుతుంది. అందుకే వినాయకుడు రెండు దంతాల్లో ఒకదాన్ని తగ్గించుకున్నారు. త్యాగం ద్వారా ఆత్మవిశ్వాసం అహంకారంగా మారకుండా ఆయుధంగా మార్చుకున్నారు. వ్యక్తులూ, సంస్థలూ ఆత్మవిశ్వాసానికి, అహంకారానికి మధ్య సాధించాల్సిన సమతౌల్యానికి ఏకదంతుడే మార్గదర్శి.

పూజ విధానం.. ప్రకృతి ఆరాధన..

వినాయకుడు అందరికీ అందుబాటులో ఉండే దేవుడు. పెరట్లో లభించే ఆకులతో పూజ.. ఇంట్లో నూకలతో ఉండ్రాళ్లు చేసి నైవేద్యం పెడితే చాలు. బోలెడంత సంతృప్తి. అలాగే అందరికీ అందుబాటులో ఉండటం, పర్యావరణం, ప్రకృతికి అనుకూలంగా వ్యవహరించడం అనేవి మానవాళికి పెద్ద బలం. వ్యాపారాలు, వృత్తిలో నాణ్యత, నైపుణ్యాల తర్వాత ప్రధాన విజయ రహస్యం అందరికీ అందుబాటులో ఉండటమే.

మూషిక వాహనం..
– సిబ్బందిపై నియంత్రణ..

వినాయకుడి వాహనమైన ఎలుక చురుకుదనానికి గుర్తు. గణనాథుడికి మూషికం వాహనంగా ఉపయోగపడుతుండగా.. అదుపులోలేని ఎలుక వినాశనాన్ని సృష్టించగలదు. అలాగే నాయకుడు సిబ్బంది, సహచరులనూ ప్రేమిస్తూ వారి అవసరాలను గమనిస్తూ వారిపై అదుపు కలిగి ఉండాలని మూషిక వాహనం సూచిస్తోంది.

వినాయక చవితి శుభాకాంక్షలు




మాజీ ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి నియోజవర్గంలోని ప్రజలకు మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి శుక్రవారం వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. వినాయకుని అనుగ్రహంతో ప్రతి ఒక్కరికీ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు సిద్ధించాలని కోరుకొంటున్నట్లు పేర్కొన్నారు.
ధర్మవరం రూరల్: ధర్మవరం నియోజకవర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి శుక్రవారం వినాయక చవితి శుభాకాంక్షలను తెలియజేశారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. మత సామరస్యంతో పండుగ జరుపుకోవాలని కోరారు.

డాక్టర్ సత్యనిర్ధారణ్‌కు మదర్ థెరిస్సా అవార్డు



డాక్టర్ సత్యనిర్ధారణ్

ధర్మవరం అర్బన్: పట్టణానికి చెందిన డాక్టర్ సత్యనిర్ధారణ్ మదర్ థెరిస్సా అవార్డుకు ఎంపికయ్యాడు. బెంగళూరులోని సోమలరాజు ఫౌండేషన్ 12వ వార్షికోత్సవం సందర్భంగా పదేళ్లుగా రెడ్‌క్రాస్ సొసైటీలో విశేషసేవలు అందిస్తున్న డాక్టర్ సత్యనిర్ధారణ్‌కు మదర్ థెరిస్సా అవార్డును ప్రకటించింది. ఈయన ఈనెల 14 బెంగళూరులో అవార్డును అందుకోనున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మండల కేంద్రంలోని ఓ ఇంటిలో మలాథిన్ మందును పిచికారీ చేస్తున్న వైద్యసిబ్బంది

ఎన్పీకుంట: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ ఆనంద్‌వర్ధన్ సూచించారు. మండల కేంద్రంలో శుక్రవారం మలేరియా సబ్ యూనిట్ అధికారులతో కలిసి ఫీవర్ సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా పలు వీధులలో మలాథిన్ మందును పిచికారీ చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో ఒక డెంగీ కేసు నమోదైందన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున రోడ్లు, డ్రైనేజీల్లో చెత్తచెదారం పేరుకుపోయి దోమలు వ్యాప్తి చెందుతాయన్నారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. ఎంపీహెచ్ఈఓ రామాంజులు, మలేరియా సబ్ యూనిట్ అధికారి మహబూబ్‌బాషా, సీహెచ్ఓ నాగలక్ష్మీ, ఏఎన్ఎమ్ శంకరమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ



క్రీడాకారులకు దుస్తులు, విద్యా సామగ్రి అందిస్తున్న మదన్‌మోహన్‌రెడ్డి

పుట్టపర్తి: బుక్కపట్నం కేజీబీవీ విద్యార్థినులకు రూరల్ అగ్రికల్చర్ డెవలప్‌మెంట్ ట్రస్టు అధ్యక్షుడు శుక్రవారం క్రీడాదుస్తులు, విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఇటీవల నరసరావుపేటలో జరిగిన రాష్ట్రస్థాయి ఫ్లోర్‌బాల్ పోటీల్లో ప్రతిభచాటిన వసంత,సాయిశ్రీలను అభినందించారు. పాఠశాలకు ఇన్వర్టర్ అందించాలని ఆయనను ప్రిన్సిపాల్ సౌజన్యకుమారి కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో పాఠశాల పీఈటీ స్వర్ణ, ట్రస్టు సభ్యులు శ్రీరామిరెడ్డి, తలమర్ల సంజీవరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోండి



మాట్లాడుతున్న సీఐ శ్యామ్‌రావు

ముదిగుబ్బ: వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ముదిగుబ్బ రూరల్ సర్కిల్ సీఐ పి.శ్యామ్‌రావు గణేష్ ఉత్సవ కమిటీలకు సూచించారు. శుక్రవారం పట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గణేష్ ఉత్సవ కమిటీలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక విగ్రహాల ప్రతిష్ఠ, మండపాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. నిమజ్జనం రోజూ నిబంధలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పట్నం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.
అమడగూరు: వినాయక చవితి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ వెంకటనారాయణ శుక్రవారం గణేష్ ఉత్సవ కమిటీలకు సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఇప్పటికే పలు గ్రామాల నుంచి విగ్రహ ఏర్పాటుకు దరఖాస్తులు రాగా అనుమతినిచ్చామన్నారు. ఊరేగింపు సమయంలో బాణాసంచా కాల్చడానికి, డీజేకు అనుమతి లేదన్నారు. పోలీసులు అనుమతి ఇచ్చిన గ్రామంలో ఏదైనా గొడవలు జరిగితే దానికి అనుమతి పత్రంలో సంతకాలు చేసిన గ్రామ పెద్ద మనుషులే బాధ్యత వహించాలన్నారు. జమేదారు సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.
కదిరి టౌన్: పట్టణంలో వినాయక విగ్రహాల ఏర్పాటుకు తప్పనిసరిగా పోలీసులు అనుమతి తీసుకోవాలని పట్టణ సీఐ డీవీ నారాయణరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలో ఇప్పటి వరకు 95 మంది మాత్రమే అనుమతులు పొందారని పేర్కొన్నారు. మండపాల వద్ద జాగ్రత్తలు పాటించాలని సీఐ నిర్వాహకులకు సూచించారు.
బత్తలపల్లి: వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని బత్తలపల్లి ఎస్ఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పోట్లమర్రి, వేల్పుమడుగు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి పండుగ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం



పార్టీ నేతలతో సమావేశమైన మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: టీడీపీ నేతలు బెదిరింపులు, దౌర్జన్యాలకు భయపడొద్దని అన్ని విధాలుగా అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పార్టీ శ్రేణులకు భరోసా కల్పించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తాజా రాజకీయాలు, ఎన్నికల ఫలితాల అనంతరం నియోజకవర్గంలో చోటు చేసుకున్న పరిస్థితులపై నేతలను అడిగి తెలుసుకున్నారు. ఫలితాల అనంతరం నియోజకవర్గంలో పార్టీ నాయకులు, సానుభూతిపరుల ఆస్తులపై టీడీపీ నాయకులు దాడులు, అక్రమ కేసులు బనాయించిన వారి వివరాలు తెలుసుకున్నారు. ఏ ఒక్క కార్యకర్త భయపడొద్దని ప్రతి ఒక్కరికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గెలుపోటములు సహజమేనని టీడీపీ నేతలు ఇది తెలుసుకొని మసలుకోవాలన్నారు. మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబులపతి, వైస్ చైర్మన్ మాతంగి తిప్పన్న, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, కౌన్సిలర్ సూర్యాగౌడ్, మాజీ కౌన్సిలర్లు నారాయణరెడ్డి, సాయి, నాయకులు భువనేశ్వర్‌రెడ్డి, నారపరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీపీఎస్ వాహనాల్లోనే ఇసుక రవాణా



మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డి

ధర్మవరం అర్బన్: జీపీఎస్ ఉన్న వాహనాల్లో ఇసుక రవాణా చేసేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఆయన విలేకరులతో మాట్లాడారు. త్వరలో ప్రభుత్వం ఇసుక రవాణా తేదీని ప్రకటిస్తుందన్నారు. ఇసుక వినియోగదారులు బుకింగ్, రవాణా వ్యవస్థలను మరింత సులభతరం చేస్తున్నామని తెలిపారు. ఇసుకను స్టాక్ యార్డ్ నుంచి మాత్రమే తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలోని తాడిమర్రి మండలం సీసీరేవు, ముదిగుబ్బ మండలం పీసీరేవుల్లో మాత్రమే ఇసుక పంపిణీ చేస్తామని తెలిపారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇసుక పంపిణీ చేస్తామన్నారు. ఇసుక బుకింగ్ సచివాలయ ఉద్యోగులతో రెండు షిఫ్టులలో జరుగుతుందని చెప్పారు. డంపింగ్ పాయింట్ వద్ద సంబంధిత అధికారులు, పోలీసులు ఉంటారని తెలిపారు. అక్రమంగా ఇసుక తరలించకుండా రాళ్ల అనంతపురం, గరిశెనపల్లి వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. స్టాక్ యార్డు వద్ద మండల సర్వేయర్లు ఉంటారని ఇసుక రవాణా, పాయింట్ల వద్ద సీసీ కెమెరాలు ఉంటాయని వివరించారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి



మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

ముదిగుబ్బ: మండల కేంద్రంలో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని మేజర్ పంచాయతీ సర్పంచ్ లక్ష్మీదేవి అధికారులను కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఆదినారాయణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతు మండలంలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలన్నారు. మండల కేంద్రంలో అక్రమ లేఔట్లు, రోడ్డుకు ఇరువైపులా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి బంకులు వేసుకొని కొంత మంది బాడుగలకు ఇస్తున్నారని కోఆప్షన్ సభ్యుడు బాలముని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ క్రాప్ బుకింగ్ ఈ నెల 15లోపు చేయించుకోవాలని ఏఓ లక్ష్మీనరసింహులు రైతులకు సూచించారు. సబ్సిడీ ప్రత్యామ్నాయ విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మండల కేంద్రంలో పేదల స్థలాలపై కొంత మంది దౌర్జన్యం చేస్తున్నారని అలాంటి వారిని ఉపేక్షించేది లేదని ఎంపీపీ పేర్కొన్నారు. వరద బాధితుల కోసం ఈ సందర్భంగా కొంత మొత్తాన్ని ఎంపీడీఓ కవిరాజు అందజేశారు. ఈ సందర్భంగా ఆయా శాఖలకు చెందిన అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. వైస్ ఎంపీపీలు వెంకటరెడ్డి, క్రిష్ణమ్మ, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల అధికారులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ



విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేస్తున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి: మేడాపురం గ్రామ సమీపంలోని తూర్పు బావుల వద్ద ఉన్న ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం విద్యా సామగ్రి పంపిణీ చేశారు. చిన్న వెంకటేష్ కుమార్తె అనిత ఇదే పాఠశాలలో ప్రాథమిక విద్యను అభ్యసించింది. ప్రస్తుతం అనిత బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. తాను చదువుకున్న పాఠశాల విద్యార్థులకు సాయం అందించాలని భావించి పాఠశాలలోని 53 మంది విద్యార్థులకు పలకలు, నోట్‌బుక్స్, టేబుల్స్, పుస్తకాలు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం గురుమూర్తి ఉపాధ్యాయులు వెంకటరంగారెడ్డి, సుదర్శన రెడ్డి పాల్గొన్నారు.

నీరు నిల్వ ఉండకుండా చూసుకోండి

చెన్నేకొత్తపల్లి: గ్రామాల్లో నివాసాల చుట్టూ నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు. ఎన్ఎస్‌గేట్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్య సిబ్బంది శుక్రవారం న్యామద్దెల సచివాలయం-2 పరిధిలోని ప్రాంతాల్లోని పర్యటించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి నీటి తొట్టిలో నిల్వ చేసిన నీటిని పరిశీలించారు. దోమల లార్వా ఉన్న నీటిని పారబోశారు. నీరు నిల్వ ఉంచడం ద్వారా దోమలు పెరిగి వ్యాధులు సోకే అవకాశం ఉందని తెలిపారు. దోమల ద్వారా వ్యాపించే డెంగీ, మలేరియాపై ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షపు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో అబేట్ మందు పిచికారీ చేయించారు. హెల్త్ అసిస్టెంట్ వెంకటేష్, సచివాలయ ఏఎన్ఎం అశ్విని, ఆశావర్కర్ మల్లేశ్వరి పాల్గొన్నారు.
చెన్నేకొత్తపల్లి: గ్రామీణ ప్రజలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ ప్రశాంత్ సూచించారు. కనుముక్కల గ్రామంలో శుక్రవారం ఎన్ఎస్ గేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో చిన్నారులు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. గర్భిణులకు రక్తహీనత పరీక్షలు చేసి, సూచనలు ఇచ్చారు. బీపీ, షుగర్‌తో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.



ధర్మవరంలో పూలు కొనుగోలు చేస్తున్న ప్రజలు



కదిరి వేమారెడ్డి సర్కిల్ వద్ద పండుగ సందడి

చవితి సందడి

ధర్మవరం అర్బన్/కదిరి అర్బన్: ధర్మవరం, కదిరి పట్టణాల్లోని ప్రధాన ప్రాంతాల్లో చవితి సందడి కనిపించింది. వినాయకుని ప్రతిమలను కొనుగోలు చేయడంతోపాటు వినాయకునికి ఇష్టమైన చెరుకులు, గడ్డి, పండ్లు, పూలు, టెంకాయలు తదితర వాటిని కొనుగోలు చేసేందుకు ప్రజలు తరలివచ్చారు. తోరణాలు, వివిధ రకాల అలంకరణల సామగ్రిని విక్రయించేందుకు వ్యాపారస్తులు పోటీపడ్డారు.

ముగిసిన ఎల్ఐసీ వారోత్సవాలు

ధర్మవరం రూరల్: ఎల్ఐసీ ధర్మవరం శాఖలో బీమా వారోత్సవాల శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా బ్రాంచి మేనేజర్ ఎం. విజయశేఖర్ మాట్లాడుతూ బీమా రంగలో ఎల్ఐసీ ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన, ఆటల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఏఓ సురేష్, ఏబీఎం గజేంద్ర, ఏఏఓ శ్రీరాములు, కోటేశ్వరరావు, రవీంద్ర, ఆనంద్, రామాంజనేయులు, ఏజెంట్లు కాటంరెడ్డి, చంద్రాయుడు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ



మహిళా రైతుకు విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

చెన్నేకొత్తపల్లి: ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో పంపిణీ చేస్తున్న ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. శుక్రవారం స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయంలో రైతులకు సబ్సిడీ ధర్లపై ఉలవలు, అలసంద విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీసీడ్స్ జిల్లా మేనేజర్ సుబ్బయ్య, వ్యవసాయాధికారి ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

కదిరి అర్బన్: ఏటిగడ్డతండాకు చెందిన శకుంతల అనే మహిళ ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ మోహన్ తెలిపారు. భర్త గోవింద్‌నాయక్, మామ గణేనాయక్ తనపై దాడి చేసినట్లు బాధితురాలు ఫిర్యాదు చేసిందన్నారు.